క్లుప్తంగా

నేడు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మూసాపేట: బాలాజీనగర్ డివిజన్‌లో పలు అభివృద్ధి నిర్మాణ పనులను శనివారం ఉదయం 8గంటలకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ పగుడాల శిరీష బాబూరావు చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు డివిజన్ అధ్యక్షుడు సిహెచ్. ప్రభాకర్ గౌడ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కేపీహెచ్‌బీ కాలనీ రోడ్డు నెంబర్ వన్, సరోజినీ దేవి మహిళా మండలి బిల్డింగ్ పార్కు పక్కను పార్కుల అభివృద్ధికి శంకుస్థాపన, కైత్లాపూర్ సిగ్నల్ వద్ద డ్రైక్లీనింగ్ షాపు ప్రారంభం, కేపీహెచ్‌బీ కాలనీ 15వ ఫేజులో సీసీ రోడ్లకు శంకుస్థాపన, రాఘవేంద్ర సొసైటీలో సీసీ రోడ్ల పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొనాలని కోరారు.

పరామర్శ



ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి కౌండిన్య గౌడ సంఘం సెక్రటరీ పాండురంగారావు సతీమణి అమల శుక్రవారం స్వర్గసురాలయ్యారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ యువ నాయకుడు దొడ్ల రామకృష్ణగౌడ్ ఆమె పార్థివదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

కార్మికులకు చెక్కుల అందజేత




కార్మికులకు చెక్కులను అందజేస్తున్న కార్మిక నాయకుడు రవిసింగ్ తదితరులు

మూసాపేట: కంపెనీలో కార్మికులకు ఇవ్వాల్సిన గ్రాట్యూటీ డబ్బులను బీఆర్ఎస్‌కేవీ కార్మిక నాయకుడు, శ్రమశక్తి అవార్డు గ్రహీత రవిసింగ్ శుక్రవారం మూసాపేటలోని ఆయన కార్యాలయంలో కార్మికులకు చెక్కుల రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శోభ అను ప్రిన్స్ కంపెనీలో గత కొన్ని నెలలుగా పనిచేస్తున్న 16 మంది కార్మికులకు నెలన్నర పని రోజులకు సంబంధించి డబ్బులను యాజమాన్యాన్ని ఎన్నిసార్లు అడిగినా ఇవ్వకపోవటంతో ఆయా కార్మికులు సంప్రదించానని తెలిపారు. కంపెనీ యాజమాన్యంతో పలు దఫాలుగా చర్చించి కార్మికులకు న్యాయంగా రావాల్సిన డబ్బులను చెక్కుల ద్వారా అందించానని తెలిపారు. కార్మికులకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

గిరిజన బంధు అమలు చేయాలి

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీకాలనీ రోడ్డు నం.1లోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద తెలంగాణ గిరిజన సంఘం నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి కృష్ణనాయక్ మాట్లాడుతూ.. గిరిజన వజ్రోత్సవాల్లో గిరిజన బంధును అమలు చేసి తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలుపుకోవాలని డిమాండ్ చేశారు. దళితులకు దళిత బంధు అమలు చేస్తున్న విధంగా, బీసీలకు వృత్తి కులాలకు లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని ప్రకటిస్తున్నట్లు ముఖ్యమంత్రి కేసీఆర్ గిరిజన బంధును అమలు చేస్తామని ప్రకటించారని అన్నారు. కానీ ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదని.. నేడు జరగబోయే గిరిజన వజ్రోత్సవాల సందర్భంగా గిరిజన బంధును అమలు చేయాలన్నారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకోకపోతే గిరిజనులందరూ ఒకే తాటిపైకి వచ్చి ఉద్యమం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శివకుమార్, మండల నాయకులు శంకర్ నాయక్, మంగ్య భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి



బాలానగర్: ఐడీపీఎల్ గోశాల పక్కనే ఉన్న చెట్లలో ఓ గుర్తు తెలియని వృద్ధుడు చనిపోయాడు. ఐడీపీఎల్ కంపెనీ సెక్యురిటీ గార్డు బాలానగర్ పోలీసులకు సమాచారం ఇవ్వటంతో పోలీసులు వెళ్లి చూడగా వృద్ధుడు చనిపోయి కనిపించాడు. షర్ట్, లుంగీ ధరించి ఉన్నాడు. చుట్టు ప్రక్కల విచారించగా ఆచూకీ లభ్యం కాలేదు. వడదెబ్బతో కానీ, అనారోగ్యం వల్ల కానీ చనిపోయి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. రక్తసంబంధీకులు ఎవరైనా ఉంటే పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని బాలానగర్ సీఐ కె.భాస్కర్ తెలిపారు.

జూదరుల అరెస్టు

మోతీనగర్: గుట్టు చప్పుడు కాకుండా పేకాడుతున్న ఓ ఇంటిపై పోలీసులు దాడి చేశారు. ఈ సంఘటన అల్లాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ శ్రీపతి ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం రాత్రి 8.30 గంటల ప్రాంతంలో అల్లాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాజీవ్‌గాంధీనగర్ సీ బ్లాక్‌లో ఇంట్లో జూదమాడుతుండగా దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. రూ.80వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

వార్డు సుపరిపాలన

సందడిగా వార్డు కార్యాలయాల ప్రారంభోత్సవం

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జంట సర్కిళ్ల పరిధిలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పట్టణ ప్రగతిలో భాగంగా అన్ని డివిజన్లలో శుక్రవారం ఆయా డివిజన్ల కార్పొరేటర్‌లు వార్డు కార్యాలయాలను ప్రారంభించారు. బోయినపల్లి డివిజన్‌లో వార్డు కార్యాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ గ్రేటర్ హైదరాబాద్‌లో ప్రజల వద్దకు పాలన తీసుకవచ్చిన నాయకుడు ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ అని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత నూతనంగా సెక్రటేరియట్ నుంచి మండల కార్యాలయాలు ఏర్పాటు చేశారన్నారు.

◆ శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ఆల్విన్ కాలనీ డివిజన్‌లో వార్డు కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వార్డు కార్యాలయాలు ప్రజా సమస్యలు పరిష్కరించడానికి ఒక చక్కటి వేదికన్నారు. ఈ చక్కటి సదవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకొని సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. మూసాపేటలోని వార్డు కార్యాలయాన్ని ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ కార్పొరేటర్ మహేందర్‌తో కలిసి ప్రారంభించారు.

◆ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు చేరువలో సమస్యల పరిష్కారానికి వార్డు కార్యాలయాల ఏర్పాటు ఎంతో దోహదపడుతుందన్నారు. గతంలో దూరంగా ఉండటంతో అనేక మంది ఇబ్బందులు పడేవారని ప్రస్తుతం ఏ డివిజన్‌కు ఆ డివిజన్ పరిధిలోనే వార్డు కార్యాలయాలను ఏర్పాటు చేసుకున్నామన్నారు.

◆ అదే విధంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పిలుపు మేరకు సమస్యల సత్వర పరిష్కారానికి, ప్రజలకు పరిపాలన సౌలభ్యం మరింత చేరువ చేసే విధంగా వార్డు కార్యాలయాలను స్థానిక కార్పొరేటర్లు ప్రారంభించారు. సమస్యలను ఎంత సమయంలో పరిష్కారం చేయాలనే నిర్ణీత గడువు సూచించే సిటిజన్ చార్టర్‌ని కూడా ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. ఇప్పటి నుంచి స్థానిక ప్రజలు ఎలాంటి సమస్య వచ్చినా వార్డు కార్యాలయాన్ని సందర్శించి ఫిర్యాదు చేసి తగిన పరిష్కారం పొందాలని ఆయా కార్పొరేటర్‌లు సూచించారు. ప్రజలు తమ పౌర ఫిర్యాదులను తెలియజేయడానికి వీలుగా వార్డు కార్యాలయ వ్యవస్థను ప్రవేశపెట్టి దేశంలోనే మొట్టమొదటి మెట్రోనగరంగా హైదరాబాద్ అవతరించిందని ఈ ఘనత కేవలం మంత్రి కేటీఆర్‌కే దక్కుతుందన్నారు.





బోయినపల్లి డివిజన్‌లో వార్డు కార్యాలయాన్ని ప్రారంభించి పరిశీలిస్తున్న కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్



ఫతేనగర్ డివిజన్‌లో వార్డు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సతీష్ గౌడ్





శంషీగూడలో వార్డు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, తదితరులు



వార్డు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్, కార్పొరేటర్ మహేందర్

- నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌కు ఓ కార్యాలయం
- ఒకపై ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయి: ఎమ్మెల్యే మాధవరం
- సమస్యలపై స్పందించకుంటే అధికారులపై కఠిన చర్యలు

ఓల్డ్ బోయిన్‌పల్లి: ప్రజల ముంగిటకు పాలనను తీసుకురావడం దేశ చరిత్రలో తెలంగాణ రాష్ట్రంలోనే మొదలు కావడం ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనాదక్షతకు నిదర్శనమని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ప్రజలకు అందుబాటులోకి వార్డు కార్యాలయాలను తీసుకొచ్చి 11 విభాగాల అధికారులను నిరంతర ప్రజా సమస్యల పరిష్కారం కోసం అందుబాటులో ఉంచడం ఆనందంగా ఉందన్నారు. శుక్రవారం ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ వార్డు పాలన కార్యాలయాన్ని కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్, జీహెచ్ఎంసీ సర్కిల్ ఉపకమిషనర్ రవీందర్‌తో కలసి ప్రారంభించారు. అనంతరం కార్యాలయంలో చేసిన ఏర్పాట్లను పరిశీలించారు.అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో దేశం, రాష్ట్రం బాగుండాలని హిందూ, ముస్లిం, క్రైస్తవులు, సిక్కులతో సర్వమత ప్రార్థనలను చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజలు వార్డు కార్యాలయంలోకి వెళ్లి సమస్యను చెప్పిన, వాట్సాప్, మెసెజ్ పెట్టిన 48 గంటల్లో సమస్యలను పరిష్కరిస్తారని ప్రజలకు చెప్పారు. 150 డివిజన్లలో ఎక్కడ పిర్యాదు చేసిన తక్షణమే ఆయా డివిజన్ పాలన కార్యాలయానికి పంపించామన్నారు.

◆ తెలంగాణ ఏర్పాడిన తర్వాతా జిల్లాల వారీగా కలెక్టరేట్లు, రాష్ట్ర సచివాలయం, మండల కార్యాలయాలు, ఇప్పుడు ఏ వార్డుకు అ వార్డు కార్యాలయాలను ఏర్పాటు చేసి అన్నీ విభాగాల అధికారులను ఒకే దగ్గరకు చేర్చి ప్రజలకు దగ్గరై సమస్యలను పరిష్కారించేందుకు కృషి చేస్తారన్నారు. నెలలో నేను కూడా నాలుగైదు రోజులు వార్డు కార్యాలయంలో కూర్చొని ప్రజల నుంచి వస్తున్న సమస్యలు, అధికారులు స్పందిస్తున్న తీరును చూస్తామన్నారు. ఆయా డిపార్టుమెంట్లకు నిధులను అందిస్తున్నామన్నారు. అధికారులు పనులు చేయకపోతే చర్యలు తీసుకుంటామన్నారు.

◆ గతంలో ఓల్డ్ బోయిన్‌పల్లిలో ఎమ్మెల్యే వస్తే మంచినీరు ఇచ్చి మాట్లాడాలనే ప్రజలు ఖాళీ కుండాలను ప్రదర్శించేవారని కనీసం వాటర్ ట్యాంక్ కూడా లేని పరిస్థితుల్లో తాను వచ్చిన తర్వాత 7 లక్షల 50 వేల గ్యాలన్ల వాటర్ ట్యాంక్‌ను అల్వాల్‌లో నిర్మించి ఓల్డ్ బోయిన్‌పల్లికి నీటిని తీసుకొచ్చామని అన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలోని అయా డివిజన్లలో రూ.450 కోట్లతో 378 కిలోమీటర్ల మేర పైపులైన్లు వేసి నీటి సమస్యను తీర్చిన చరిత్ర మనదని గుర్తు చేశారు. రోడ్లును పూర్తి చేసేందుకు ఇటీవల కాలంలో డివిజన్‌కు రూ. 3 కోట్ల నిధులను మంజూరు చేశామని పనులు కూడా జరుగుతున్నాయని అన్నారు.

ఈశాన్యం అచ్చొచ్చింది కాబట్టే సక్సెస్ అయ్యాను:

ఈశాన్యం అచ్చొచ్చింది కాబట్టి ఏ శుభకార్యం చేసిన ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ నుంచే ప్రారంభిస్తున్నా మని అన్నారు. నియోజకవర్గంలో ఏ కార్యక్రమం చేసిన ఇక్కడి నుంచి మొదలు పెట్టడం ద్వారా కలిసిరావడంతోనే కూకట్‌పల్లిని ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. హస్మత్‌పేట బోయిన్ చెరువును సుందరంగా తీర్చిదిద్దెందుకు కృషి చేస్తున్నామని ఇప్పటికే రూ.16 కోట్లతో అభివృద్ధి చేసి 80 శాతం దోమలను నిర్మూలించామన్నారు. మరింత అభివృద్ధి పరిచి జీమ్‌లను పెట్టి వినాయక చవితి, బతుకమ్మ, రంజాన్, క్రిస్మస్ వంటి పండగలు జరుపుకునేలా చేస్తామని చెప్పారు.

◆ ఆర్ఆర్‌నగర్‌లో వర్షపు నీటి ముంపు వల్ల ఇళ్లల్లోకి నీళ్లు వచ్చాయని తెలిసి రూ.12 కోట్ల నిధులతో ఆర్ఆర్‌నగర్ నుంచి అలీ కాంప్లెక్స్ వరకు బాక్స్ డ్రైనేజీ ఏర్పాటు చేశామని తెలిపారు. హస్మత్‌పేట మోడల్ మార్కెట్ భవనంలోకి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు. ఓల్డ్ బోయిన్‌పల్లికి పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేయించి భవనాన్ని కూడా నిర్మించి ఇస్తామని వెల్లడించారు.

ఎన్నికలు వస్తున్నాయి.. మాయా మాటలు చెప్పేటోళ్లు వస్తున్నారు..

ఎన్నికలు వస్తున్నాయని మాయా మాటలు చెప్పేవాళ్లు వస్తున్నారని వారి మాటలు నమ్మకండని అన్నారు. ఇక్కడ కార్పొరేటర్‌ను మూడు సార్లు గెలిపించారు.. తనను కూడా ఆశీర్వాదించి మరోసారి గెలిపించి అభివృద్ధికి తోడ్పడటంతో పాటు ప్రజలకు సేవ చేసే భాగ్యం కల్పించాలని అన్నారు. లాక్‌డౌన్ వచ్చినప్పుడు కాలనీ అసోసియేషన్ ప్రతినిధులతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమస్యలు అడిగి తెలుసుకుని పరిష్కారించామని వెయ్యి క్వింటాళ్ల బియ్యం పంచామన్నారు. డబుల్ బెడ్‌రూమ్‌లు అందించేందుకు త్వరలో వెరిఫికేషన్ కోసం అధికారులను నియమిస్తున్నామని తెలిపారు. వచ్చే నేల నుంచి ప్రజలకు సంక్షేమ పథకాలను అందించబోతున్నామని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో మరోసారి కారు గుర్తుకు ఓటు వేసి అత్యాధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఈఈ గోవర్దన్, డీఈ బాలకృష్ణ, ఎఈ అరవింద్‌కుమార్, వాటర్ వర్క్స్ సీజీఎం విజయరావు, జీఎం ప్రభాకర్‌రావు, మేనేజర్ తేజ, లక్ష్మణ్‌యాదవ్, విద్యుత్ ఏడీ కృష్ణ, ఏఈ అఖిల్ నాయకులు నరేందర్‌గౌడ్, బల్వంత్‌రెడ్డి, సయ్యద్ ఏజాజ్, కర్రె జంగయ్య, మక్కాల నర్సింగ్‌రావు, కర్రె లావణ్య, ఇర్ఫాన్, మేకల హరినాథ్, గడ్డం నర్సింగ్‌రావు, బుర్రి యాదగిరి, వేణుగోపాల్‌రెడ్డి, లలితా, రోజ, శశికళ, ఉమా, దేవి, సంతోషి తదితరులు పాల్గొన్నారు.



అల్లాపూర్ డివిజన్‌లో వార్డు కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం అధికారితో కార్పొరేటర్ సబిహా బేగం తదితరులు



వార్డు కార్యాలయాన్ని ప్రారంభించిన కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ తదితరులు



బాలాజీనగర్ డివిజన్‌లో వార్డు కార్యాలయ ప్రారంభోత్సవంలో కార్పొరేటర్ శిరీష, తదితరులు

సఫాయి కార్మికులకు సలాం

ఓల్డ్‌బోయిన్‌పల్లి: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా జీహెచ్ఎంసీ వ్యాప్తంగా జరిగిన 'సఫాయి అమ్మ, సఫాయి అన్నకు సలాం' కార్యక్రమం ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో ఘనంగా జరిపారు. డివిజన్ పరిధిలోని సమతానగర్ కమ్యూనిటీ హాల్‌లో సమతానగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సఫాయి కార్మికులైన ముత్యాలమ్మ, రేణుక, అనిల్, సంపత్‌లకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. వారికి స్వీట్ బాక్స్‌లను అందించి మీకు సలాం అంటూ గౌరవించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి గొట్టపాటి నాగేశ్వర్‌రావు, ఉపాధ్యక్షుడు దండంరాజు రామచందర్ రావు, సహాయ కార్యదర్శి మదుసూదన్‌రెడ్డి, మహిల విభాగం కన్వీనర్ సదాలక్ష్మీ, ప్రమీలా, మీనాక్షీ, సుధా తదితరులు పాల్గొన్నారు.



కార్మికులను సన్మానిస్తున్న సమతానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు

పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం



పండ్లు, శానిటైజర్లు అందజేస్తున్న బొట్టు విష్ణు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశాల మేరకు కూకట్‌పల్లి దయార్‌గూడలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పార్కు వద్ద జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య కార్మికులను శుక్రవారం సన్మానించారు. పండ్లు, శానిటైజర్లను అందజేశారు. ఈ కార్యక్రమాన్ని బీఆర్ఎస్ఎస్సీ విభాగం అధ్యక్షుడు బొట్టు విష్ణు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

పారిశుద్ధ్య కార్మికుల సేవలు అభినందనీయం

ఆల్విన్‌కాలనీ: జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య కార్మికుల సేవలు అభినందనీయమని కూకట్‌పల్లి డివిజన్ పాపిరెడ్డినగర్ బస్తీ అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం పలువురు పారిశుద్ధ్య కార్మికులను చంద్రారెడ్డి శాలువాతో సత్కరించారు. అనంతరం పట్టణ ప్రగతి ర్యాలీ నిర్వహించి పరిసరాల పరిశుభ్రతపై బస్తీలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో జీహెచ్ఎంసీ కార్మికులకు గుర్తింపు లభించడంతో పాటు మంచి జీతభత్యాలు లభిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో బస్తీ ప్రధాన కార్యదర్శి భగవంతరెడ్డి, కోశాధికారి నర్సింహులు ముదిరాజ్, నాయకులు ధర్మారావు, అనంతరాములు, కేవీ రాజు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



కార్మికులను సన్మానిస్తున్న పాపిరెడ్డినగర్ బస్తీ అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన



పారిశుద్ధ్య కార్మికులతో కలిసి అవగాహన కల్పిస్తున్న పురేందర్‌రెడ్డి

ఆల్విన్‌కాలనీ: దశాబ్ది ఉత్సవాల సందర్భంగా కార్పొరేటర్ రోజాదేవి పిలుపు మేరకు రామకృష్ణ కాలనీ అధ్యక్షుడు జనంపల్లి పురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపల్ సిబ్బందితో కాలనీలో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. కాలనీలో ప్రతి అపార్టుమెంట్ వాసులను కలిసి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం మున్సిపల్ సిబ్బందిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు సూర్యనారాయణ, లక్ష్మీనారాయణ, ప్రసాదు, లక్ష్మారెడ్డి, శ్రీధర్, డాక్టర్ వంశీ, వెంకటేశ్వరరావు, మున్సిపల్ సిబ్బంది అనసూయమ్మ, శ్రీను, సుదర్శన్, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా కూకట్‌పల్లిలోని ఏడోఫేజ్ రెసిడెంట్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక జీహెచ్ఎంసీ కార్మికులను సన్మానించారు. జీహెచ్ఎంసీ ఎస్ఎఫ్ఏ బాబూరావు, అంజిబాబు, వి.లక్ష్మీనారాయణ, బి.హరిబాబు, గణేశ్‌రెడ్డి పాల్గొన్నారు.
– కూకట్‌పల్లి

ప్రతి ఒక్కరూ ఆదిపురుష్ చిత్రాన్ని వీక్షించాలి

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: ప్రభాస్ నటించిన ఆదిపురుష్ చిత్రాన్ని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు శుక్రవారం వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక కాలానికి తగ్గట్టుగా రామాయణ ఇతివృత్తాన్ని ప్రేక్షకులకు ఎంతో చక్కగా చిత్ర బృందం అందించిందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ సినిమా చూసి భారతదేశంలోని స్త్రీకి ఇచ్చిన విలువ యుగాలుగా ఎలా చూపించారన్నది అర్థమవుతుందని పేర్కొన్నారు. రాముడు పరిపాలించిన ఈ భరత భూమిలో ధర్మం ఏ విధంగా ఉందో నేటికీ భారతదేశ సంప్రదాయాలు ఇతర దేశాలు పాటిస్తున్నాయంటే ఆనాడు రాముడు చూపిన మార్గమే అని అన్నారు. సినిమా వీక్షించిన వారిలో వర్టెక్స్ వర్మ, శ్యామల రాజు తదితరులు ఉన్నారు.



ఆదిపురుష్ చిత్రాన్ని వీక్షించిన కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు